TELTEL/2023/87917

జనంవెలుగు

అనునిత్యం అక్షరసత్యం

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 02 | సంచిక : 322 | బుధవారం 12 - 02 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6 /-

పట్టణాల నుంచి పల్లెలకు పాకిన డ్రగ్స్ కల్చర్

విద్యార్థులే టార్గెట్ గా గంజాయి అమ్మకాలు

జనంవెలుగు, నిజామాబాద్:- జిల్లాలో విద్యార్థులే టార్గెట్ గా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే హై స్కూల్ విద్యార్థులతో పాటు కాలేజీ విద్యార్థులకు గంజాయిని పరిచయం చేస్తున్నారు. లేత ప్రాయంలోనే పిల్లలను ఈ విషపు అలవాట్లు తమకు బానిసలుగా మార్చేసుకుంటున్నాయి. కొందరు గంజాయి వ్యాపారులు మార్గమేదైనా సరే, అడ్డగోలుగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో పిల్లల బంగారు భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల వ్యాపారంలోకి దిగి సమాజాన్ని నాశనం చేస్తున్నారు.

గంజాయి చాక్లెట్లు.. సిగరెట్లు..

స్కూల్ విద్యార్థులనే టార్గెట్ గా చేసుకుని చీకటి వ్యాపారులు గంజాయిని మిక్స్ చేసి తయారు చేసిన చాక్లెట్లను, సిగరెట్లను కొందరు గంజాయి విక్రేతలు స్టూడెంట్స్ కు రహస్యంగా అమ్ముతున్నారు. చదువులో వెనకబడిన వారిని, రఫ్ అండ్ టఫ్ గా ఉండి, అప్పుడప్పుడు గుట్కాతింటూ మొరటుగా కనిపించే కొంతమంది స్కూల్ విద్యార్థులను గుర్తించి వారిని ముందుగా ఈ గంజాయిని అలవాటు చేసేందుకు సెలెక్ట్ చేసుకుంటున్నారు. వారితో స్నేహం పెంచుకుని మెల్లిగా వారికి మందును అలవాటు చేయడం, దావత్ లతో వారితో పాటు కూర్చోనివ్వడం చేస్తారు. తరువాత నెమ్మదిగా వారి ఎదుటే గంజాయిని స్టయిల్ గా గంజాయిని పీలుస్తూ వారిలో ఆసక్తిని కలిగిస్తారు. వారి ఆసక్తిని గమనించాక కొద్దికొద్దిగా గంజాయిని వారికి అలవాటు చేస్తారు. ఇక అంతే కొద్దిరోజుల వరకు గంజాయిని ఫ్రీగా ఇచ్చి బాగా అలవాటయ్యాక డబ్బులుంటేనే ఇస్తామంటారు. దీని కోసం పిల్లలు ఇళ్లలో దొంగచాటుగా డబ్బులు తీసుకుని వచ్చి కొంటారు. కొద్ది రోజులు పోయాక మీకు గంజాయి ఫ్రీగా దొరకాలంటే మీలో కొందరికి అలవాటు చేయాలని, వారితో వ్యాపారం చేయాలని చిట్కాలు నేర్పుతారు. ఇలా ఈ అలవాటును పరిచయం చేసి వ్యసనంగా మార్చడమే కాకుండా వ్యాపారంలోకి కూడా దింపి పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు.

యువకులను దందాలోకి దింపుతున్న వ్యాపారులు..

చలాకీగా మాట్లాడి మాటలతో ఆకర్షించే లక్షణాలున్న 20 నుంచి 25 ఏళ్ల వయస్సులోపు యువకులను గంజాయి వ్యాపారులు ఈ దందాలో దింపుతున్నారు. తమకు నమ్మకంగా పనిచేస్తాడన్న నమ్మకమున్న కొందరిని కొద్ది నెలల పాటు గమనించి వ్యాపారులకు వారి మీద నమ్మకం కలగగానే ఈ దందాను వారికి పరిచయం చేసి వారికి వచ్చే లాభాలను వివరిస్తున్నారని తెలుస్తోంది. దందాలో దిగగానే టార్గెట్ లు ఫిక్స్ చేసి టార్గెట్ రీచ్ అయిన వారికి ఆకర్షణీయమైన ప్యాకేజీలతో కట్టిపడేస్తున్నారని సమాచారం. వీరు చేస్తున్న దందాను రహస్యంగా వీడియోలు తీసి, కస్టమర్లతో మాట్లాడుతున్న కాల్స్ ను రికార్డ్ చేసి వీరికి తెలియకుండానే దందా నిర్వహిస్తున్న ప్రధాన సూత్రధారులు తమ వద్ద భద్రంగా ఉంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా వీరి వ్యాపార సంబంధాలు చెడి దందాను వదిలి వెళతానన్నా, లేదంటే దందా గురించి పోలీసులకు, మీడియాకు సమాచారం ఇద్దామనే ఆలోచన చేసినా వీరి వద్ద భద్రపరుచుకున్న వీడియోలు, కాల్ రికార్డ్ లతో బ్లాక్ మెయిల్ చేసి తమ గుప్పిట్లోనే ఉంచుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కసారి ఈ దందాలో చిక్కుకున్నా, అలవాటుకు గురైనా బయట పడటం చాలా కష్టమని ఈ దందా గురించి బాగా తెలిసిన కొందరు చెపుతున్నారు.

మెదడు పై ప్రభావం చూపుతున్న గంజాయి మత్తు..

ఎండు గంజాయి నింపిన సిగరెట్లను తాగే అలవాటు చేసుకున్న విద్యార్థులు చదువులో పూర్తిగా వెనకబాటుకు గురై చాలా మంది పరీక్షల్లో ఫెయిలై భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లు తెలుస్తోంది. చాలా మంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు కూడా ఈ వ్యసనానికి బానిసలై జీవితాలు పాడు చేసుకున్న వారు ఉమ్మడి జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. గంజాయి, డ్రగ్స్ అలవాటున్న వారికి దీని ప్రభావం నేరుగా మెదడు పై చూపిస్తుందని, మత్తులోకి దిగాక తామేం చేస్తున్నామో, తమ హోదా, స్టేటస్, కుటుంబం, పరువు అన్నీ మరిచిపోయి ఓ ట్రాన్స్ లో ఉంటారని, వారేం చేస్తున్నారో వారికే తెలియని స్థితిలో దారుణాలు చేస్తారని నిపుణులు చెపుతున్నారు.

నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..

డ్రగ్స్ కు బాగా బానిసైన నగరానికి చెందిన ఓ 30 ఏళ్ల గొప్పింటి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కొద్ది నెలల క్రితం ప్రైవేట్ హాస్పిటల్ లో హంగామా క్రియేట్ చేశారు. ఇన్ పేషెంట్ గా చికిత్స పొందుతున్న ఆయన హాస్పిటల్ లోని సీజర్ ను చేతిలో పట్టుకుని అందరినీ బెదిరిస్తూ, హాస్పిటల్ లోని అద్దాలు ధ్వంసం చేసి నడిరోడ్డుపైకి పరుగెత్తాడు. సుమారు గంటన్నర పాటు నడిరోడ్డుపైనే హాస్పిటల్ సిబ్బందికి, పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు చుక్కలు చూపించాడు. ఇలాగే బయటికి కనిపించని దృశ్యాలు ఎన్నో కుటుంబాల్లో వారికి కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. మానసిక ప్రశాంతతను దూరం చేస్తున్నాయి. నగరంలో గ్యాంగ్ వార్ లో కత్తులు దూసుకుంటున్న వారిలో కూడా చాలా మంది యువకులు ఈ గంజాయి అలవాటుకు బానిసలైన వారున్నారని, ఆ మత్తులోనే చిన్న పాటి గొడవలకు సైతం కత్తులతో దాడులు చేసుకుంటున్నారని, ఒకరినొకరు పొడుచుకునే స్థాయికి వెళుతున్నారని తెలుస్తోంది. గంజాయి నియంత్రణకు ఎక్సైజ్, పోలీస్, టాస్క్ ఫోర్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో గంజాయి పై నియంత్రణ సాధించలేకపోతున్నారు. దీంతో గంజాయి స్మగ్లర్లు తమదైన శైలిలో వ్యాపారం కొనసాగిస్తుండటం సమాజానికి ప్రమాదకరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగాలకై నిరుద్యోగ యువత దరఖాస్తులు

జనం వెలుగు, ఆర్మూర్:- ఆర్మూర్ నియోజకవర్గపు కాంగ్రెసు పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్ రక్షన్ లో మంగళవారం నిరుద్యోగ యువత ఉపాధికై దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో మార్కెటు కమిటి చైర్మన్ సాయిబాబా గౌడు దరఖాస్తులను స్వీకరించారు. గల్ఫ్ దేశాలకు వెళ్ళే కార్మికులు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాయి బాబా గౌడు తెలిపాడు. ఈ కార్యక్రమంలో కొంతం మురళి,జిమ్మీ రవి,గంగాధర్, చిట్టి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెసు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

జనం వెలుగు, ఆర్మూర్:- తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెసు పార్టీ మహిళల కిచ్చిన హామీలను అమలు చేయ కపోతే ప్రజా క్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో మంగళవారం తన నివాసంలో సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీల మీద రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆమె చర్చలు జరిపారు. ప్రతి మహిళకు 2500 రుపాయలను, కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం, మరిన్ని బస్సు లను పెంచి మహిళలకు ప్రజా రవాణాను సులభతరం చేయాలని, ఆడ పిల్లలకు ఉచిత స్కూటీలు ఇవ్వాలని, అలాగే వృద్ధాప్య ఫించన్లను 4000 రుపాయలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. త్వరలో జరుగబోయే మహిళా దినోత్సవం వరకు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ లకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.

పిఏసి చైర్మన్ ఎంపిక అప్రజాస్వామికం నిబంధనలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

జనం వెలుగు, ఆర్మూర్:- పార్టీ పిరా యించిన ఎంఎల్ఏ అరికేపూడి గాంధీని పిఏసి చైర్మన్ గా నియామకం చేయడం అప్రజాస్వామికమని మాజి మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నాడు. పిఏసి సమావేశం నుండి వాకౌటు చేసిన అనంతరం బిఆర్ఎస్ ఎల్పి కార్యాలయంలో మంగళవారం విలేఖరులతో ఆయన మాట్లాడాడు. పార్టీ పిరాయించిన, అనర్హత కేసు విచారణలో గల ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బదులుగా ప్రతిపక్ష హోదా కలిగిన వ్యక్తికి ఇవ్వాల్సిన పిఏసి చైర్మన్ పదవిని ఇవ్వాల్సి ఉండగా సిఎం రేవంత్ రెడ్డి పార్టీ ఫిరాయింపు దారునికి చైర్మన్ పదవిని అంట గట్టాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. పార్టీ ఆదేశాల మేరకు పిఏసి సమావేశాలను గతంలో 2 సార్లు, ఇప్పుడు మూడవ సారి సమావేశాన్ని వాకౌట్ చేయడం జరిగిందని ఇక ముందు జరిగే సమావే శాలను బహిష్కరిస్తామని ఆయన తెలిపాడు. నూతన 2 వ పిఏసి చైర్మన్ ఎంపికను ఎంఎల్సి రమణను సంప్రదించి ఎంపిక చేయాలని దీనిపై పునరాలోచించాలని ఆయన కోరాడు. అనర్హత కేసు విచారణలో ఉండగా పార్టీ మారిన గాంధీని చైర్మన్ గా కొనసాగిస్తు సమావేశాలను కొనసాగించడం సమంజసం కాదని ఆయన తెలిపాడు. సాంప్రదాయాలకు విరుద్ధంగా పిఏసి చైర్మన్ నియామకం జరిగిందని ప్రతిపక్ష హోదాలో గల వ్యక్తికే పిఏసి చైర్మన్ పదవి ఇవ్వాలని పార్లమెంటు, అసెంబ్లీ నియామాలు తెలుపుతున్నాయని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో గంగుల కమలాకర్, ఎంఎల్సిలు సత్యవతి రాథోడ్, ఎల్ రమణలు పాల్గొన్నారు.

బాల్కొండ సి.హెచ్.సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

జనం వెలుగు, బాల్కొండ:- ప్రజలకు ఎల్లవేళల మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించాడు. మండల కేంద్రమైన బాల్కొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా వైద్యులు, స్టాఫ్ నర్సులు తదితరులు అంకిత భావంతో పని చేయాలని ఆయన హితవు పలికాడు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్, తదితర విభాగాలను క్షుణ్ణంగా ఆయన పరి శీలించాడు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆయన ఆరా తీశాడు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారని, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని ఆయన అడిగి తెలుసుకున్నాడు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు ఆయన తెలిపాడు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, వైద్యులు, అందు బాటులో ఉండి రోగులకు సేవలం దిస్తుండడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశాడు.

మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనం తనిఖీ.

అంతకుముందు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బాల్కొండలోని బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను కిచెన్, డైనింగ్ హాల్ లను పరిశీలించి సదుపాయాలను గమనించాడు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశాడు. బియ్యం నిల్వలు, సరుకుల స్టాక్ ను ఆయన పరిశీలించాడు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను ఆయన అడిగి తెలుసుకున్నాడు. తాజా కూరగాయలు వినియోగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసు కోవాలని నిర్వాహకులను ఆయన ఆదేశించాడు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించాడు. పాఠశాలలో కొత్తగా టాయిలెట్ల నిర్మాణానికి చ ర్యలు తీసుకుంటామని ఆయన అన్నాడు. ఈ కార్యక్రమంలోఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, స్థానిక తహసీల్దార్ శ్రీధర్, తథితర అధికారులు పాల్గొన్నారు.

మోకాలి శస్త్ర చికిత్స కోసం ఎల్ఓసి అందజేసిన వేముల

జనం వెలుగు, బాల్కొండ:- బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలోని బడాభీంగల్ గ్రామానికి చెందిన హాన్మాండ్లు మోకాలి నొప్పులతో నడవలేక బాదపడుతున్నాడు. ఇట్టి సమాచారాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, మోకాలి శస్త్ర చికిత్స కోసం 2 లక్షల రూపాయల ఎల్ఓసిని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు మంగళవారం హైదరాబాద్ లో అందజేయడం జరిగింది. హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స కోసం చేరగా అందుకు నిరుపేదలమైన మాకు ఆపరేషన్ కోసం 2 లక్షల ఎల్ఓసి మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మేలు మర్చి పోలేమని, జీవి తాంతం ఆయనకు రుణపడి ఉం టామని కుటుంబ సభ్యులు తెలి యజేశారు.

రేవంత్ కు సోదరుడిలా ఉంటా

జనం వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 11:- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను వ్యతిరేకిస్తున్న మందకృష్ణ మాదిగ అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి కమిట్ మెంట్ ను మందకృష్ణ మాదిగ అభినందించారు. ఒక కమిట్ మెంట్ తో వర్గీకరణ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి ఒక సోదరుడిగా అండగా ఉంటానన్న మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని మందకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా ఉపకులాల వర్గీకరణలో పలు సమస్యలను సీఎంకు వివరించారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉందని న సీఎం రేవంత్ రెడ్డి మందకృష్ణకు తెలిపారు. అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్ లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. దీనివల్ల ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని..వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు.

బాసర ఆలయంలో త్రిపుర గవర్నర్ ప్రత్యేక పూజలు

జనం వెలుగు, నిర్మల్:- త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనా రెడ్డి బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అయన ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు అమ్మవారి హారతి, తీర్త ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తరువాత అయన బాసర ఆలయ సమీపంలో ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మీ తీర్థం లో పాల్గొన్నారు.